# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 04-10-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ)లు ఆత్మనిర్భర్ భారత్‌కు కీలకమైన శిక్షణా శిబిరాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- ❖ హింసను విడనాడి జన జీవన స్రవంతిలో కలవాల్సిందేనని కేంద్ర హోం మంత్రి అమిత్ షా మావోయిస్టులకు స్పష్టం చేశారు.
- ❖ `ఆప్కి పుంజీ.. ఆప్కా అధికార్..` కార్యక్రమాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈరోజు గుజరాత్‌లో ప్రారంభించారు.
- ❖ భారత్ వెస్టిండీస్ జట్ల మధ్య జరిగిన తొలి టెస్ట్ క్రికెట్ మ్యాచ్ లో భారత్ ఘన విజయం సాధించింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ)లు ఆత్మనిర్భర్ భారత్‌కు కీలకమైన శిక్షణా శిబిరాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో 62 వేల కోట్ల రూపాయలకు పైగా విలువైన యువత కేంద్రీకృత కార్యక్రమాలను ప్రధానమంత్రి ఈరోజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దేశంలో 2014 వరకు 10 వేల ఐటీఐలు ఉండగా గత దశాబ్దంలో 5 వేలు కొత్తగా ఐటీఐ కళాశాలలు ఏర్పాటు చేసి 1 కోటీ 50 లక్షల మంది యువతకు స్థానిక భాషల్లో నైపుణ్య శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. యువత సామర్థ్యాన్ని మరింత పెంచడానికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో పని చేస్తోందని తెలిపారు. భారత్ మూడవ అతిపెద్ద ఆర్థికశక్తిగా రూపుదిద్దుకునేందుకు సిద్ధమవుతోందని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 23 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

హింసను విడనాడి జన జీవన స్రవంతిలో కలవాల్సిందేనని కేంద్ర హోం మంత్రి అమిత్ షా మావోయిస్టులకు స్పష్టం చేశారు. ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్‌లో ఈరోజు జరిగిన బస్తర్ దసరా లోకోత్సవంలో ఆయన పాల్గొని గ్రామీణ బస్సు సేవా పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం కింద బస్తర్, సుర్గుజా డివిజన్ల పరిధిలోని 34 మార్గాల్లో బస్సు సర్వీసులు నడుపుతారు. ఈ సందర్భంగా హోం మంత్రి ప్రసంగిస్తూ... సాయుధ పోరాట మార్గాన్ని కొనసాగించే వారు భద్రతా దళాల నుండి కఠినమైన

చర్యలను ఎదుర్కొంటారని అన్నారు. నక్సలిజం సమస్య కారణంగా బస్తర్ ప్రాంతం చాలా కాలంగా అభివృద్ధికి దూరమయ్యిందన్నారు. వచ్చే ఏడాది మార్చి 31 నాటికి దేశాన్ని వామపక్ష తీవ్రవాదం నుండి విముక్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించిందని అమిత్ షా పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

స్వాతంత్ర్య సమరయోధుడు తిరుప్పూర్ కుమరన్ జయంతి సందర్భంగా ఉపరాష్ట్రపతి సీ పీ రాధాకృష్ణన్ ఆయనకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఈ రోజు నివాళులర్పించారు. కుమరన్ ను అచంచలమైన దేశభక్తి, త్యాగానికి చిహ్నమని ప్రశంసించారు. ఆయన వారసత్వం తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటుందని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

గాజాలో శాంతి ప్రయత్నాల్లో నిర్ణయాత్మక పురోగతి సాధించిన అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ నాయకత్వాన్ని స్వాగతిస్తున్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఈ రోజు పేర్కొన్నారు. బందీల విడుదలకు అంగీకారం కుదరడం శాంతిస్థాపనకు కీలక ముందడుగు అని అన్నారు. శాశ్వత, న్యాయమైన శాంతి పునరుద్ధరణ ప్రయత్నాలకు భారత్ ఎప్పుడూ మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

అదామ్య శ్రేణి ఫాస్ట్ పెట్రోల్ వెసల్స్ (FPVs)లలో రెండవది అయిన అక్షర్ నౌక ఈరోజు పుదుచ్చేరిలోని కారైకల్ వద్ద భారత తీర రక్షక దళం (ICG)లోకి ప్రవేశించింది. ఈ 51 మీటర్ల పొడవైన ఈ FPVని 60 శాతానికి పైగా స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించారు. 'మేక్ ఇన్ ఇండియా' లో భాగంగా ఇది రూపుదిద్దుకొంది. ఈ నౌక సుమారు 320 టన్నుల బరువును కలిగి, రెండు 3000 కిలోవాట్ డీజిల్ ఇంజిన్‌ల ద్వారా నడపబడుతుంది. ఇది గరిష్టంగా గంటకు 27 నాటికల్ మైళ్ల వేగంతో ప్రయాణిస్తుంది. ఈ నౌకలో ఇంటిగ్రేటెడ్ బ్రిడ్జ్ సిస్టమ్ (IBS), ఇంటిగ్రేటెడ్ ప్లాట్‌ఫామ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (IPMS) ఆటోమేటెడ్ పవర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (APMS) కూడా ఉన్నాయి.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈరోజు గుజరాత్‌లోని గాంధీనగర్ నుండి దేశవ్యాప్తంగా `ఆప్కి పుంజీ.. ఆప్కా అధికార్` కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆర్థిక వ్యవస్థలోని వివిధ రంగాలలో ఉన్న క్లెయిమ్ చేయని ఆస్తులను త్వరగా పరిష్కరించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. క్లెయిమ్ చేయని డిపాజిట్లను వారి చట్టబద్ధమైన హక్కుదారులకు తిరిగి ఇచ్చేలా ఈ కార్యక్రమం జరుగుతుందని అన్నారు. ఆర్థిక సంస్థలు, హక్కుదారుల మధ్య అంతరాన్ని తగ్గించడం ప్రజల ఆర్థిక సాధికారతకు చాలా కీలకమని అన్నారు. లబ్ధిదారుల అర్హతపై అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకతను ఆర్థిక మంత్రి ఈ సందర్భంగా తెలియజేస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

కీలకమైన ఖనిజాల రీసైక్లింగ్‌ను ప్రోత్సహించడానికి పదిహేను వందల కోట్ల రూపాయల ప్రోత్సాహక పథకానికి కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ వివరణాత్మక మార్గదర్శకాలను ఈ రోజు జారీ చేసింది. ఈ-వ్యర్థాలు, వినియోగించిన లిథియం-అయాన్

బ్యాటరీల నుండి కీలకమైన ఖనిజాలను తిరిగి పొందడం, ఉత్పత్తి చేయడం కోసం రీసైక్లింగ్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడం ఈ పథకం లక్ష్యం. దీని ప్రయోజనాలను పొందడానికి వచ్చే ఏడాది ఏప్రిల్ 1వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలి.

= = = = = = = = = = = = = = = = = = = = =

రాబోయే బీహార్ అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా  ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ నేతృత్వంలోని ఎన్నికల సంఘం ఈరోజు రాజకీయ పార్టీలతో చర్చలు జరిపింది. ఈ సమావేశంలో బీహార్ ప్రధాన ఎన్నికల అధికారి వినోద్ గుంజ్యాల్ తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఆ రాష్ట్రంలో గుర్తింపు పొందిన 12 రాజకీయల పార్టీలకు చెందిన ప్రతినిధులు కూడా హాజరయ్యారు. ఎన్నికల నిర్వహణపై వారి అభిప్రాయలను ఎన్నికల సంఘం అధికారులు ఈ సందర్భంగా అడిగి తెలుసుకున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

జమ్మూ కాశ్మీర్‌లోని వాతావరణ పరిస్థితుల దృష్ట్యా శ్రీ మాతా వైష్ణోదేవి యాత్ర రేపటి నుండి ఈ నెల 7వ తేదీ వరకు నిలిపివేస్తున్నామని అధికారులు వెల్లడించారు. యాత్రికుల భద్రత, శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. శ్రీ మాతా వైష్ణోదేవి పుణ్యక్షేత్ర బోర్డు వెబ్‌సైట్ లో అధికారికంగా జారీ చేసిన తాజా సమాచారాన్ని మాత్రమే భక్తులు అనుసరించాలని సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

స్వాతంత్ర్య సమరయోధుడు శ్యామ్‌జీ కృష్ణ వర్మ జయంతి సందర్భంగా సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆయనకు ఈరోజు నివాళులర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన చూపిన ధైర్యం, అంకితభావం, అచంచల సేవా స్ఫూర్తిని ప్రశంసించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా శ్యామ్ జీ కృష్ణ వర్మ సేవలను గుర్తు చేసుకున్నారు. ఇంగ్లాండ్‌లో ఇండియా హౌస్ స్థాపన ద్వారా విదేశాలలో నివసిస్తున్న భారతీయులలో జాతీయవాద భావాలను మేల్కొల్పడంలో ఆయన కీలక పాత్ర పోషించారన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ వెస్టిండీస్ జట్ల మధ్య అహ్మదాబాద్ లోని నరేంద్రమోదీ ఇంటర్‌నేషనల్ స్టేడియం వేదికగా జరిగిన తొలి టెస్ట్ క్రికెట్ మ్యాచ్ లో భారత్ ఘన విజయం సాధించింది. ఈ రోజు ఉదయం భారత్ తొలి ఇన్నింగ్స్‌ను 448 పరుగుల వద్ద డిక్లేర్ చేయగా.. రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన వెస్టిండీస్ 146 పరుగులకే ఆలౌట్  అయ్యింది. దీంతో భారత్ ఇన్నింగ్స్ తేడాతో విజయం సాధించింది. ఇక ఈ విజయంతో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్‌లో 40 పాయింట్లతో భారత్ 3వ స్థానానికి చేరుకుంది. ఇదిలా ఉండగా 19వ తేదీ నుండి ప్రారంభం కానున్న ఓడీఐ సిరీస్ ఆస్ట్రేలియా పర్యటన కోసం బీసీసీఐ భారత జట్టు ప్రకటించింది. 15 మంది సభ్యులతో కూడిన జట్టుకు శుభ్‌మన్ గిల్‌ను నూతన సారధిగా నియమించింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

భారత వాతావరణ విభాగం (ఐఎండీ) మహారాష్ట్రలోని కొన్ని జిల్లాలకు 'శక్తి' తుఫాను ప్రమాద హెచ్చరికలు జారీ చేసింది. ఈ రోజు నుంచి 7వ తేదీ వరకు ఆ ప్రాంతంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఇక ఈశాన్య భారతదేశంలోని అరుణాచల్ ప్రదేశ్, అస్సాం మేఘాలయ రాష్ట్రాలలో రేపు భారీ వర్షాలు కురుస్తాయని  అంచనా వేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = =